క్లుప్తంగా

హెల్మెట్‌ధారణ తప్పనిసరి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై వై.అమ్మన్నరావు సూచించారు. సోమవారం స్థానిక వారపు సంతవద్ద వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మితిమీరిన వేగంతో రాకపోకలు చేయవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అలాగే మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్, తదితర అంశాలపై వివరించారు.

రామినాయుడుకు నంది అవార్డు

సంతకవిటి: మండలంలోని ఎస్.రంగారాయపురానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు నిలురోతు రామినాయుడును తెలుగు వెలుగు సాహితీ వేదిక నంది అవార్డు వరించింది. స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు–2025 సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం అందజేశారు. పౌరాణిక నాటకాల్లో వీరబాహుడు, సత్యకీర్తి పాత్రల ద్వారా నాటక రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నందుకుగాను ఆయనకు ఈ అరుదైన సత్కారం లభించినట్లు సమాచారం.

త్వరితగతిన కేసులను పరిష్కరించాలి

మెంటాడ: పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని ఆంధ్ర పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆమె సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఓ మహిళపై పోలీసులు చేయి చేసుకున్న ఘటనకు సంబంధించి విచారణ జరుగుతోందని త్వరలోనే నివేదిక అందచేయడం జరుగుతుందని ఆమె చెప్పారు. అలాగే ఎన్నికల కోడ్‌ను ఎస్ఐ సీతారాం ఉల్లఘించినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా సీఐ ఆధ్వర్యంలో విచారణ చేపడుతున్నామని, ఆ నివేదికను కూడా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అనంతరం సీఐ రమణతో కలిసి ఆంధ్ర రిజర్వాయరును పరిశీలించారు.

దళితులపై దాడిచేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదుచేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు, తదితరులు

సాలూరు: మండలంలోని కరాసవలస దళితులపై పట్టణానికి చెందిన వ్యాపారి సుతాపల్లి రాము దాడిచేయించి కొట్టించారని నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేయాలని పలువురు ఆదివాసీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఆదివాసీ సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావులు మాట్లాడుతూ, కరాసవలస దళితులు సాగుచేస్తున్న భూములను కాజేయాలనే దురుద్దేశంతో గుర్రపువలస గ్రామ గిరిజనులను దళితులపై రాము ఎగదోసి దాడి చేయించి కొట్టించారని ఆరోపించారు. రాముపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేయాలని, దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనుల మధ్య తగాదాలు సృష్టించి భూములను కాజేయాలని కుట్రపన్నుతున్నారన్నారు. రాముకు రాజకీయ అధికార అండదండలు ఉండడం వల్ల ఈ విధంగా దౌర్జన్యాలకు పాలపడుతున్నారని ధ్వజమెత్తారు. రాము భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని, సాగులో ఉన్న దళితులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుందరరావు, జానకిరావు, చలం, సింహాచలం, తుల సమ్మ, నవీన్, రాము, బోడయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో పాఠశాలలు ఎత్తి వేసేందుకు సిద్ధమైన కూటమి

పార్వతీపురం టౌన్: గిరిజన గ్రామాల్లో పాఠశాలలు ఎత్తి వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడిందని గిరిజన సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక ఐటీడీఏ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలం గోచెక్క పంచాయతీ లిడికివలస, వెలగ వలస పంచాయతీ, వెలగవలస, మరికి పంచాయతీ కొత్తవూరు ప్రాథమిక పాఠశాలు ఎత్తి వేయడానికి కూటమి ప్రభుత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఇలా జిల్లాలో, గిరిజన ప్రాంతాల్లో అనేకం ఉన్నాయని, ఇదే జరిగితే గిరిజన విద్యార్థులు ప్రాథమిక విద్య దశలోనే డ్రాప్ అవుట్‌లుగా మారుతారన్నారు. ఈ నేపథ్యంలో ఇటువంటి నిర్ణయం కూటమి ప్రభుత్వం మానుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

● ఉచిత నేత్ర వైద్యశిబిరం..



వీరఘట్టం మండల కేంద్రంలోని సత్యసాయి సేవా సమితిలో జిల్లా అంధత్వ నివారణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో శస్త్రచికిత్సలకు 51 మందిని ఎంపిక చేసినట్లు క్యాంప్ కో ఆర్డినేటర్ సీహెచ్ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు కిల్లారి భీముడు మాస్టారు, గెంబలి మురళి, కందుల లక్ష్మి, మద్ది వరహానర్సింహులు, చిన్నారి గురునాథం, వడ్డాది సావితమ్మ, తదితరులు పాల్గొన్నారు. - వీరఘట్టం

● భక్తి శ్రద్ధలతో నోములు..



భామిని మండలం గురండిలో వెలిసిన చంద్రశేఖర స్వామి ఆలయంలో మాఘ సోమవారం సందర్భంగా మహిళా భక్తులు కైలాస గౌరీ నోములు చేపట్టారు. 75 మంది మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో రమేష్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు. - భామిని

● రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం శూన్యం



రెవెన్యూ సదస్సుల్లో సమస్యల పరిష్కారం శూన్యమని సీపీఎం నాయకుడు కొల్ల సాంబమూర్తి ఆరోపించారు. కొమరాడ మండల కేంద్రంలో రైతులతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అటు కూటమి నాయకులు, ఇటు అధికారులు ఉత్తి ప్రచారమే తప్ప ఆ దిశగా చర్యలేమీ లేవని విమర్శించారు. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదని మండిపడ్డారు. వెయ్యికి పైగా దరఖాస్తులు భూ సమస్యలపై అధికారులకు ఇస్తే వాటిలో కనీసం ఒక్కటి కూడా పరిష్కరించ లేదన్నారు. దీంతో తహసీల్దారు కార్యాలయం చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేయకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. -కొమరాడ

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



సీతంపేట: వివేకానంద విద్యాభారతిలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అర్చకులు



గరుగుబిల్లి: అక్షరాభ్యాసానికి ముందు సరస్వతీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

సీతంపేట/భామిని :

వసంత పంచమి సందర్భంగా పాఠశాలలు, ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, తల్లిదండ్రులు చిన్నారులచే ముందుగా సరస్వతీదేవికి పూజలు చేయించి, ఓం సరస్వతీ నమస్తుభ్యం అంటూ అక్షరాలు రాయించారు.

గరుగుబిల్లి: మండలంలోని రావివలస సరస్వతీదేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం సోమవారం జరిగింది. వసంత పంచమి పురస్కరించుకుని, చేపట్టిన ఈ కార్యక్రమంలో తొలుత సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేసినానంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.



భామిని: గురండిలో అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం..



కంబరవలస హైస్కూల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వీరఘట్టం: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న యూటీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఫెడరేషన్ నాయకులు సోమవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రచారం చేపట్టి, ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.మురళీమోహనరావు, మజ్జి పైడిరాజు, బోనంగి దుర్గాప్రసాదరావు, కొండపల్లి గౌరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ హరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలని ఎల్విన్‌పేట సీఐ బి.హరి కోరారు. కురుపాంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని తెలిపారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, రోడ్లపైకి వాహనాలతో వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని కోరారు. అలాగే స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి



చినమేరంగి ఉన్నత పాఠశాల విద్యార్థులు, సిబ్బందికి సూచనలిస్తున్న డీఈవో తిరుపతినాయుడు

జియ్యమ్మవలస: చదువులో వెనకబడిన పిల్లల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని డీఈవో తిరుపతినాయుడు సూచించారు. మండలంలోని చినమేరంగి, పెదమేరంగి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించారు. చినమేరంగి పాఠశాలకు ఉదయం 8 గంటల 40 నిమిషాలకే చేరుకున్న ఆయన అక్కడ నిర్వహిస్తున్న ఫిజికల్ సైన్స్ స్టడీ అవర్‌ను పరిశీలించారు. ఆ తర్వాత పాఠశాల ప్రార్థన సమయం ఆ తర్వాత తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి వారి అభ్యసన సామర్థ్యాలు తనిఖీ చేశారు. అంతగా చదువు రాని పిల్లలను దత్తత తీసుకుని మరీ వారి విద్యాప్రగతికి కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు. ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్, డైరీ, ఎఫ్–ఏ3 పరీక్షా పేపర్లను చూసి పలు సూచనలు చేశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం వంటకాలు చూసి, మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు వంటకాలు వండిపెట్టాలన్నారు. పదో తరగతి పరీక్షలు 40 రోజులే ఉన్నందున ఉపాధ్యాయులు రాత్రి సమయాల్లో విద్యార్థుల ఇంటికి వెళ్లి, వారు చదువుతున్నదీ లేనిదీ పరిశీలించాలన్నారు. శతశాతం ఉత్తీర్ణతకు సిబ్బంది కృషి చేయాలని కోరారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శిస్తున్న తహసీల్దారు బాల

గరుగుబిల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని తహసీల్దారు పి.బాల సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ పత్రాన్ని సోమవారం ప్రదర్శించారు. అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించేలా చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు బి.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు తప్పని నష్టాలు



పూత లేని మామిడి చెట్లు

పాలకొండ రూరల్: నాలుగైదేళ్లుగా ప్రతి ఏడాదీ మామిడి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. గతేడాది సీజన్‌లో పూత వచ్చినా మంచు ప్రభావంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. సాధారణంగా డిసెంబర్ నెలలో పూత ప్రారంభమై ప్రస్తుత ఫిబ్రవరిలో పిందెలు వస్తాయి. కానీ ఈ దఫా నెలలు గడుస్తున్నా ఆశించిన మేర పూత రాకపోడంతో మామిడి రైతులు నిరాశ చెందుతున్నారు. నియోజకవర్గంలో దాదాపు ఐదు వేల ఎకరాల్లో ఈ పరిస్థితి ఉంది. రబీ ప్రారంభంలో అధిక వర్షాల కారణంగా రైతులు మామిడి సీజన్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు సూచనలతో అవసరమైన మందులు పిచికారీ చేస్తున్నప్పటికీ, కొద్ది రోజులుగా దట్టమైన పొగమంచు కురుస్తుండడంతో సమస్య మరింత జఠిలమైంది. అదును ఉండటంతో ఆలస్యంగానైనా పూత వచ్చే అవకాశాలున్నాయని సంబంధిత రైతులు ఆశగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ ప్రతికూలత కారణంగా పూత ఆశించినంత లేదని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో మోనోక్రోట్ 2 ఎం.ఎల్, బోరాన్ 2 గ్రాములతో పాటు 13.0.45 మందు పది గ్రాములు వంతున నీటిలో కలపి పైపాటుగా చెట్లపై పిచికారీ చేయటం వల్ల ఫలితం ఉంటుందని ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి సూచించారు.

మామిడికి మంచు ముప్పు

కొమరాడ: మంచు కారణంగా మామిడి పంటకు ముప్పు వాటిల్లుతోంది. నెలరోజులుగా కురుస్తున్న పొగ, తేనెమంచుకు పువ్వు దెబ్బతింటోంది. నల్లగా మారి నేలరాలుతోంది. ఫలితంగా పూత రావడం లేదు. దీంతో మామిడి రైతు దిగాలు చెందుతున్నాడు. ఇదే తరహాలో జీడి పంట కూడా మంచు దెబ్బకు నాశనమవుతోంది. మండలంలో జీడిమామిడి మొత్తం 422 హెక్టార్లలో సాగులో ఉండగా, దీనిలో ఒక్క మామిడి 250 హెక్టార్లలో సాగులో ఉంది. డిసెంబరు, జనవరి నెలల్లో ఆయా పంటలు పూత దశకు వస్తాయి. అయితే ఫిబ్రవరి వచ్చినా పూత అంతంతమాత్రంగానే ఉంది. దీనికి ప్రధాన కారణం పొగమంచు అని రైతులు వాపోతున్నారు.



అంకుళ్లువలస తోటలో మామిడి పూత

ఉపాధి పనుల పిటిషన్‌పై హైకోర్టు తీర్పు..?

● హైకోర్టును ఆశ్రయించిన సర్పంచ్‌లు

సాలూరు: ఉపాధిహామీ చట్టానికి తూట్లు పొడుస్తూ, నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేపట్టడంపై హైకోర్టులో దాఖలైన రిట్‌పిటిషన్‌పై, ధర్మాసనం ఉపాధిపనులు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలియవస్తోంది. సాలూరు మండలంలో ఉపాధి హామీ పనులు నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపడుతున్నారని శివరాంపురం, పెదపధం, పారన్నవలస పంచాయతీల సర్పంచ్‌లు హైకోర్టులో రిట్‌పిటిషన్ వేశారు. ఉపాధిహామీ చట్టంలో గ్రామ పంచాయతీలకు కల్పించిన హక్కులు, ప్రయోజనాలను విస్మరిస్తూ కూటమి ప్రభుత్వం ఉపాధి పనులను వెండర్ పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో చేయించడం నిబంధనలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఉపాధిపనులు ప్రారంభం కాకుండా తక్షణమే చూడాలని ప్రభుత్వం తరఫున న్యాయవాదులను హైకోర్టు ఆదేశించినట్లు తెలియవస్తోంది. ఈ మేరకు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారులకు మౌఖిక ఆదేశాలు వచ్చాయని, ఈ విషయం ఆ పనులను చేపట్టిన వెండర్లకు చేరవేసినట్లు సమాచారం. కాగా ఈ కేసులో నేడో, రేపో హైకోర్టు పూర్తిస్థాయిలో తీర్పు జారీ చేసే అవకాశం ఉందని న్యాయవాది రేగు మహేశ్వరరావు తెలిపారు.

వేడుకగా శ్యామలాంబ అమ్మవారి ఘటాల ఊరేగింపు

సాలూరు: పట్టణంలో వెలసిన శ్యామలాంబ అమ్మవారి పండగ నేపథ్యంలో ఘటాల ఊరేగింపు సోమవారం ఘనంగా జరిగింది. శాస్త్రోక్తంగా మంగళవాయిదాల నడుమ ఘటాలతో వచ్చిన అమ్మవారిని భక్తులు పట్టువస్త్రాలు, పుష్పాలతో స్వాగతించారు. అధిక సంఖ్యలో భక్తులతో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్నారు.

వెంగళరాయ సాగర్‌లో చేపల విడుదల

సాలూరు రూరల్: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన 2020–2021 లో భాగంగా వెంగళరాయ సాగర్ జలాశయం పరిధి చినబీపురువలసలో 5.94 లక్షల చేపపిల్లలను మండల రెవెన్యూ అధికారి ఎన్.వెంకటరమణ మత్స్యశాఖ అధికారి వై. శ్రీదేవి సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ అధికారి బి.అప్పన్న, మత్స్యశాఖ కమిటీ అధ్యక్షుడు సురపాటి ఆదినారాయణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రెండు పూటలా పనిచేస్తేనే మస్టర్

● ఏపీఓ రామకృష్ణ

సాలూరు రూరల్: మండలంలోని ఉపాధిహామీ కూలీలు రెండుపూటలా పనిచేయాలని ఒకపూట పనిచేసి రెండోపూట రాని కూలీలకు మస్టర్ వేయడం కుదరదని ఏపీఓ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పనులు మండలంలోని 29 పంచాయతీల్లో జరుగుతున్నాయన్నారు. అయితే ఉదయం 7గంటలనుంచి 11 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తప్పనిసరిగా కూలీలు పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. అంతేకాకుండా కూలీలు రాకుండా మస్టర్ వేసినట్లు తెలిస్తే ఫీల్డ్‌అసిస్టెంట్ పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్లెక్సీల తొలగింపు

మక్కువ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన రాజకీయనాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. ఎంపీడీవో డి.డి స్వరూపరాణి ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి ఫ్లెక్సీలను తొలగింపజేశారు. అలాగే రాజకీయనాయకుల విగ్రహాల ముఖాలు బయటకు కనిపించకుండా కప్పివేశారు.

కూటమి నాయకులు తీరు మార్చుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్రాంత్, కళావతి, తదితరులు

● ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: కూటమి నాయకులు తీరు మార్చుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. డివిజన్ కేంద్రంలో వీరు విలేకరులతో మాట్లాడుతూ.. సోమవారం నిర్వహించిన నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి నాయకులు హంగామా చేశారని మండిపడ్డారు. కనీస బలం లేక పోయినప్పటికి చైర్మన్ పదవి పొందేందుకు అడ్డదారుల్లో ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందిన వారిని తమ పార్టీ వారుగా చెప్పుకోవడం సరికాదన్నారు. నగర పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిపించాలని కోరారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

చేప పిల్లల విడుదల



చేప పిల్లలు విడిచి పెడుతున్న సొసైటీ చైర్మన్ బర్ల ఆనందరావు, ఆదినారాయణ,విజేత

భామిని: మండలంలోని నులకజోడు చెరువులో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా సోమవారం చేప పిల్లలు విడిచిపెట్టారు. శ్రీరామ స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులకు ఉపయోగపడేలా 30,800 చేప పిల్లలు విడిచిపెట్టినట్లు మత్స్యకార సంఘ చైర్మన్ బర్ల ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో కె. ఆదినారాయణ, నిమ్మక విజేత, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణం పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి:

మండలంలోని రావుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)లను ఈవోఆర్‌పీడీ ఎల్.గోపాలరావు సోమవారం సందర్శించారు. రావుపల్లిలో అసంపూర్తిగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆయన ఆదేశించారు. అలాగే అన్ని కేంద్రాల్లో చెత్త నుంచి ఎరువు తయారయ్యేలా చర్యలు తీసుకోవాలని, తయారైన ఎరువును సబ్సిడీపై రైతులకు అందించి, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలని తెలిపారు. ఆయన వెంట రావుపల్లి సర్పంచ్ బి.మహేష్, కార్యదర్శి సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం

వీరఘట్టం: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని ఈఓ ఎం. రవి సూచించారు. సోమవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో బిల్లు కలెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గృహానికీ డిమాండ్ నోటీసులు అందజేసి, అనంతరం పన్ను వసూలు చేయాలన్నారు. వసూలు చేసిన మొత్తాన్ని వెంటనే పంచాయతీ ఖాతాకు జమ చేయాలని తెలిపారు. అలాగే బిల్లులు చెల్లించిన వారి వివరాలు కూడా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పాలకొండ / కురుపాం

9951602844, 9010204441

Office mail : vzmadvt@gmail.com